21సార్లు మైక్ కట్

- మాజీ మంత్రి హరీశ్‌రావుపై మంత్రుల ముప్పేట దాడి
- సభలో ఎంతసేపైనా మాట్లాడొచ్చు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): 'సాగునీటి రంగంపై అసెంబ్లీలో శ్వేతపత్రం ప్రవేశపెడతాం. 48 గంటలపాటు చర్చకు రమ్మని కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నా. కేటీఆర్, హరీశ్‌రావు కూడా చర్చలో పాల్గొనవచ్చు. కవిత కూడా పాల్గొంటానంటే ఉభయసభల సమావేశం ఏర్పాటు చేస్తం. మాట్లాడేందుకు పూర్తి అవకాశమిస్తం. ఒక్క నిమిషం కూడా మైక్ కట్ చేయం'..

ఇవీ ఇటీవల మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు. కానీ ఆచరణలో అందుకు పూర్తివిరుద్ధంగా వ్యవహరించారు. సోమవారం అసెంబ్లీలో ఒక్క హరీశ్‌రావు మాట్లాడుతుంటేనే 50 నిమిషాల వ్యవధిలో 21 సార్లు మైక్ కట్ చేశారు. కృష్ణా ప్రాజెక్టుల అప్పగింత అంశంపై అసెంబ్లీలో సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజెంటేషన్ అనంతరం బీఆర్‌ఎస్ తరఫున మాజీ మంత్రి హరీశ్‌రావు చర్చలో పాల్గొన్నారు. కాంగ్రెస్ సభలో వెల్లడించిన ప్రతి అంశాన్ని తూర్పారబట్టారు. ఆధారాలతోసహా కాంగ్రెస్ వాదన అబద్ధమని నిరూపించారు. దీంతో ఏం చేయాలో తెలియక కాంగ్రెస్ మంత్రులు, నేతలు హరీశ్‌రావుపై ముప్పేటదాడికి దిగారు. ఒకరి తర్వాత ఒకరు లేస్తూ హరీశ్‌రావును అడ్డుకొనేందుకు తీవ్రంగా యత్నించారు. అంశాన్ని పక్కదోవ పట్టించేందుకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావు మాట్లాడుతుండగానే మంత్రి ఉత్తమ్‌కుమార్ పదే పదే లేస్తూ అడ్డుతగిలారు. అనంతరం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు పదే పదే లేస్తూ చర్చకు ఆటంకం కలిగించారు. మంత్రులే కాదు ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, ఆది శ్రీనివాస్ తదితరులు సైతం తమ స్థానాల నుంచి లేచి హరీశ్‌రావు ప్రసంగానికి అడ్డుతగిలే యత్నం చేశారు. కాంగ్రెస్ మంత్రులు లేవడం.. హరీశ్‌రావు మైక్‌ను స్పీకర్ కట్ చేయడం సభలో చర్చ సందర్భంగా పరిపాటిగా మారిపోయింది.

జలహక్కులకు మరోసారి మరణశాసనం!

- తెలంగాణ సోయిలేకుండా కాంగ్రెస్ సర్కారు తీర్మానం
- నీటి కేటాయింపులకు, షేరింగ్‌లకు తేడా తెలియకుండా అత్యుత్సాహం
- 512:299 టీఎంసీలకు తెలంగాణ ఒప్పుకున్నదంటూ వితండవాదనలు
- ఏపీ వాదనలకు బలం చేకూర్చేలా అసెంబ్లీ తీర్మానం
- ట్రిబ్యునల్‌లో వాదనలకు అడ్డంకిగా మారే ప్రమాదం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల అంశంపైనే కాదు రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కూడా కాంగ్రెస్ సర్కారు సోయి లేకుండా వ్యవహరిస్తున్నది. ఆది నుంచీ అనాలోచిత నిర్ణయాలతో తెలంగాణ జలహక్కులకు గండికొట్టిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మరోసారి అదే ధోరణి అవలంబిస్తున్నారు. అందుకు కృష్ణా జలాల అంశంపై అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన తాజా తీర్మానమే నిదర్శనం.

ఇదీ ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 89 కథ

వాస్తవంగా నదీ పరిహాక ప్రాంత విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు అంటే కరువు, వాతావరణం తదితర అంశాల ప్రాతిపదికగా అంతర్రాష్ట్ర నదీవివాదాల చట్టం 1956 సెక్షన్ 3 ప్రకారం ఏర్పాటైన ప్రత్యేక ట్రిబ్యునల్ సదరు నదీ పరివాహక ప్రాంతాల రాష్ట్రాలకు ఆయా నదీజలాల్లో నీటి వాటాలను కేటాయిస్తుంది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని రూపొందించిన కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం 'మా నీళ్లు మాకే' అనే తెలంగాణ ఉద్యమ నినాదానికి విలువ లేకుండా చేసింది. సెక్షన్ 3 ప్రకారం కాకుండా ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ప్రత్యేకంగా సెక్షన్ 89 నిబంధనను పొందుపరచి దాని ప్రకారం జలాల పంపిణీ చేపట్టాలని నిర్దేశించింది. అప్పటికే ఆయా రాష్ట్రాలు వినియోగంలో ఉన్న నదీ జలాలను మాత్రమే ప్రాజెక్టుల వారీగా పంపిణీ చేయాలని నిర్దేశించింది. అప్పటికే కొనసాగుతున్న బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కే ఆ బాధ్యతను అప్పగించింది. గడచిన పదేండ్లుగా ఆ ప్రక్రియ కూడా పూర్తికాలేదు. కానీ ఇప్పుడు అదే కాంగ్రెస్ సర్కారు కృష్ణా జలాల్లో న్యాయంగా రావాల్సిన 68% వాటాను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడగలేదంటూ అసెంబ్లీలో గగ్గోలు పెట్టడంపై తెలంగాణవాదులు మండిపడుతున్నారు.

తప్పును కప్పిపుచ్చుకునేందుకు మరో తప్పు

ఉమ్మడి ఏపీ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ కృష్ణా జలాల్లో 811 టీఎంసీలను ప్రాజెక్టుల వారీగా కాకుండా ఎన్‌బ్లాక్‌గా (గంపగుత్త) కేటాయించింది. కృష్ణా జలాలను ఎక్కడి నుంచి ఎక్కడికైనా తీసుకుపోవాలనే స్వేచ్ఛను రాష్ట్రాలకు కల్పించింది. దీనిని ఆసరాగా చేసుకునే బేసిన్‌లోని తెలంగాణ ప్రాంతాన్ని ఎండబెట్టి, రివర్ బేసిన్ అవతలి ప్రాంతాలకు నీటిని తరలించే ప్రాజెక్టులకు ఉమ్మడి ఏపీ ప్రభుత్వం జలాలను కేటాయించింది. రాష్ట్ర విభజన నాటికి కృష్ణా జలాల్లో ఏపీ 512 (66%), తెలంగాణ 299 (34%) టీఎంసీలు చొప్పున వినియోగించుకుంటున్నాయంటే ఎంత అన్యాయం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. దానిని సరిదిద్దకుండానే రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటికే వినియోగించుకుంటున్న జలాలను 66:34 నిష్పత్తిలో ఆయా ప్రాజెక్టుల వారీగా కేటాయించాలని ట్రిబ్యునల్‌ను నాటి కేంద్రంలోని యూపీఏ సర్కారు నిర్దేశించింది. అయితే అప్పటివరకు ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి వినియోగానికి ఏదైనా వర్కింగ్ అరేంజ్‌మెంట్ ఉండాలి కాబట్టి నాటి బీఆర్‌ఎస్ సర్కారు ఏపీ సర్కారుతో ఏడాది కాలపరిమితితో తాత్కాలిక ఒప్పందం చేసుకున్నది. ట్రిబ్యునల్ కేటాయింపులు పూర్తికాకపోవడంతో దానిని ప్రతి నీటి సంవత్సరం పొడగిస్తూ వచ్చింది. 2021 నుంచి తాత్కాలిక ఒప్పందాన్ని ఒప్పుకోబోమని తెగేసి చెప్పింది. ట్రిబ్యునల్ కేటాయింపులు పూర్తయ్యేవరకూ 50:50 నిష్పత్తిలో జలాలను వినియోగించుకుంటామని తేల్చిచెప్పింది. కానీ నీటి కేటాయింపులకు, షేరింగ్‌లకు తేడా తెలియకుండా కాంగ్రెస్ సర్కారు అత్యుత్సాహంతో ఇప్పుడు మరో తప్పు చేస్తున్నది. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానంలో ఈ అంశాలేవి ప్రస్తావించకుండా గత ప్రభుత్వం 512:299 టీఎంసీలకు ఒప్పుకున్నదని ప్రకటించింది. అసెంబ్లీలో తీర్మానం చేసింది. ఇది రాబోయే రోజుల్లో ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ వాదనలకు తీవ్ర అవరోధంగా మారే ప్రమాదం ఉన్నదని ఇంజినీర్లు మండిపడుతున్నారు. ఇప్పటికే నాటి తాత్కాలిక ఒప్పందాన్ని, న్యాయస్థానాల్లో ఎక్కడా దానిని ప్రస్తావించవద్దనే షరతులను కూడా ఉల్లంఘించి ట్రిబ్యునల్‌లో, బోర్డు సమావేశాల్లో ఆధారాలుగా చూపుతూ ఏపీ వాదనలు వినిపిస్తున్నది. ఇప్పుడు ఏకంగా అసెంబ్లీ తీర్మానం చేయడంతో అది కూడా రేపు ఏపీకి అస్త్రంగా మారుతుందని, ఇదీ ప్రభుత్వ పూర్తి అనాలోచిత నిర్ణయమని ఇంజినీర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా తప్పులను సరిదిద్దుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పదేండ్లు పోరాడి జలహక్కులను సాధించిన కేసీఆర్

సెక్షన్ 89 ద్వారా తెలంగాణకు ఒరగబోయేది ఏమీ లేదని కేసీఆర్ సర్కార్ ఆది నుంచీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. పరివాహక ప్రాంతం ఆధారంగా నీటివాటాలను తేల్చాలని డిమాండ్ చేసింది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ కేంద్రంలోని బీజేపీ సర్కారు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. సెక్షన్ 3 ప్రకారం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి న్యాయమైన నీటి వాటా తేల్చాలని 2014 జులై14న వినతిపత్రం అందజేశారు. కేంద్రం కాలయాపన చేస్తుండటంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 2020 అక్టోబర్ 6న జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ పట్టుబట్టడంతో కేంద్రం దిగొచ్చి ట్రిబ్యునల్ ఏర్పాటుకు అంగీకరించింది. అయితే కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలా? లేదంటే ప్రస్తుతం ఉన్న బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కే సెక్షన్ 3 ప్రకారం నీటి వాటాలు పంపిణీ చేసే అధికారాలను కల్పించాలా? అనేదానిపై న్యాయశాఖ సలహా తీసుకోవాల్సి ఉన్నదంటూ మెలిక పెట్టింది. సుప్రీంకోర్టులో కేసును ఉపసంహరించుకోవాలని, ఆ తర్వాతనే న్యాయసలహా కోరతామని షరతు విధించింది. దీంతో కేంద్రం సూచనల మేరకు తెలంగాణ ప్రభుత్వం కోర్టు కేసును ఉపసంహరించుకున్నది. అయినప్పటికీ ఏడాదిన్నరపాటు కేంద్రం నుంచి సమాధానం రాకపోవడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేకసార్లు లేఖలు రాసింది. కేసీఆర్ అవిశ్రాంత పోరాటం, రాష్ట్ర ప్రభుత్వ పట్టుదలతో కేంద్రం దిగొచ్చి గత ఏడాది అక్టోబర్ 6న పరివాహక ప్రాంతాల ఆధారంగా న్యాయమైన నీటివాటాలను పంపిణీ చేయాలని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కొత్తగా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ విధంగా కాంగ్రెస్ కాలరాసిన జలహక్కులను గత బీఆర్‌ఎస్ సర్కారు పోరాడి సాధించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అనాడే విభజన చట్టంలో సెక్షన్ 3 ప్రకారం నీటివాటాల పంపిణీ చేపట్టాలని నిర్దేశించి ఉంటే ఈ సమయానికే అది కొలిక్కి వచ్చి, తెలంగాణకు న్యాయం జరిగి ఉండేదని ఇంజినీర్లు చెప్తున్నారు. అయినప్పటికీ ఈ వాస్తవాలన్నీ మరుగున పరచి అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కారు పచ్చి అబద్ధాలు చెప్పిదంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

హుక్కా పార్లర్లపై నిషేధం

- అక్రమాలకు పాల్పడితే ఏడేండ్ల వరకు కఠిన శిక్ష
- ఈ-సిగరెట్లు, గుట్కా వాడకంపై ఉక్కుపాదం
- సిగరెట్, పొగాకు ఉత్పత్తుల చట్ట సవరణబిల్లుకు ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో హుక్కా పార్లర్లపై నిషేధం విధిస్తున్నట్టు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 'సిగరెట్, పొగాకు ఉత్పత్తుల చట్టం-2003'కు చట్ట సవరణ చేసే బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు సభలో ప్రవేశపెట్టగా.. శాసనసభ, శాసన మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. ఈ బిల్లు విషయమై మండలిలో మంత్రి మాట్లాడుతూ.. సిగరెట్ కంటే హుక్కాపొగ మరింత హానికరం అన్నారు. బొగ్గు ఉపయోగించడం వల్ల కార్బన్ మోనాక్సైడ్ విడుదలతుందని, హుక్కా తాగే వారి వల్ల చుట్టుపక్కల వారికి కూడా ప్రమాదం పొంచి ఉండటంతో హుక్కాపార్లర్లపై నిషేధం అవసరమని సీఎం భావించారని, కేబినెట్‌లోనూ ఆమోదం తీసుకొని సభ ముందుకు తెచ్చామని చెప్పారు. పాఠశాల విద్యార్థులకు సిగరెట్లు, ఈ-సిగరెట్లు, గంజాయి, గంజాయి చాక్లెట్లు వంటివి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుట్కాలు, హుక్కా, పొగాకు వంటి వాణిజ్య, ఉత్పత్తి ప్రకటనలను పూర్తిగా నిషేధిస్తున్నట్టు వెల్లడించారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే ఏడాది నుంచి ఏడేండ్ల వరకు కఠినంగా శిక్ష ఉంటుందని పేర్కొన్నారు. పొగాకు, సిగరెట్లు, హుక్కా, గంజాయి తీసుకోవడం వల్ల యువత పెడదోవ పడుతున్నారని చర్చ సందర్భంగా ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే నిర్ణయాలు ఏవైనా ఓ తల్లిగా స్వాగతిస్తున్నానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు.

షరతులకు అంగీకరించకపోతే ఇవ్వం

- కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతపై అసెంబ్లీలో ఉత్తమ్ తీర్మానం
- ఏకగ్రీవంగా శాసనసభ ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం విధించిన షరతులకు అంగీకరించకపోతే ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కి అప్పగించేది లేదని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రభుత్వ విధానాన్ని అసెంబ్లీకి వివరించారు. కృష్ణా జలాల్లో 68-70% హక్కు పొందేందుకు తెలంగాణకు అర్హత ఉన్నదని చెప్పారు. ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీల నిష్పత్తిలో నీటి కేటాయింపు కారణంగా తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులకు 299 టీఎంసీలు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 225 టీఎంసీలు, భవిష్యత్‌లో చేపట్టబోయే ప్రాజెక్టులకు 260 చొప్పున మొత్తం 731 టీఎంసీలకు వరకు తెలంగాణ నీటి వాటా కోరాల్సి ఉన్నదని పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్, మల్యాల లిఫ్ట్, కేసీ కెనాల్, ముచ్చుమర్రి ద్వారా ఏపీ ప్రభుత్వం ప్రస్తుతం 1,11,400 క్యూసెక్కుల నీటిని తరలించుకొనిపోతున్నదని వివరించారు. రాయలసీమ లిఫ్ట్ పూర్తయితే రోజుకు 8 టీఎంసీలను ఏపీకి తరలించే ప్రమాదం ఉన్నదని, దీంతో కృష్ణానది ఎడారిగా మారుతుందని, నాగార్జునసాగర్ ఎండిపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. తాము అధికారం చేపట్టినప్పటి నుంచి జలదోపిడీని అడ్డుకునేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి రాష్ట్రానికి 811 టీఎంసీలు బచావత్ అవార్డు ద్వారా కేటాయించారు కానీ, ప్రాజెక్టుల వారీగా కేటాయించలేదని వివరించారు. అసెంబ్లీ ఎన్నికలకు ఒక రోజు ముందు ఏపీ ప్రభుత్వం నాగార్జునసాగర్ పైకి పోలీసులను పంపిందని, కుడికాల్వను తెరిచి 5 వేల క్యూసెక్కుల నీటిని తరలించారని సభ దృష్టికి తీసుకొచ్చారు. నీటి వాటా పంపకాల్లో జరిగిన అన్యాయం కారణంగానే తెలంగాణను తెచ్చుకున్నామని, తెచ్చుకున్న తెలంగాణలోనూ అన్యాయాలు జరగరాదన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రమాణస్వీకార చేసిన తర్వాత ప్రాజెక్టు కేటాయింపుపై తాము ఎవరితోనూ మాట్లాడలేదని, తమతో ఎవరూ సంప్రదింపులు జరపలేదని తెలిపారు.

మండలి రేపటికి వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): శాసన మండలి బుధవారానికి వాయిదాపడింది. సోమవారం సభ ప్రారంభమైన వెంటనే ఇటీవల మృతిచెందిన మాజీ ఎమ్మెల్యే పీ నర్సారెడ్డికి సభ సంతాపం తెలిపింది. అనంతరం ప్రత్యేక వినతుల్లో ఎమ్మెల్సీలు సంబంధిత సమస్యలు విన్నవించగా.. మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానాలు ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్థానంలో 2023-24 సంవత్సరానికిగాను వ్యయపు అనుబంధ అంచనాలను మంత్రి దామోదర సమర్పించారు.

మాజీ ఎమ్మెల్యేల మృతిపట్ల అసెంబ్లీ సంతాపం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఇటీవల మృతిచెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేల మృతి పట్ల అసెంబ్లీ సంతాపం తెలిపింది. సోమవారం సభ ప్రారంభంకాగానే మాజీ ఎమ్మెల్యేలు మచ్చీందర్‌రావు, పీ నర్సారెడ్డి, బిరుదు రాజమల్లు మృతికి సంతాపం తెలుపుతున్నట్టు స్పీకర్ సభలో ప్రకటించారు. ఈ సందర్భంగా సంతాపసూచకంగా సభ్యులంతా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

'సారీ' స్పీకర్ సార్!

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను క్షమాపణలు కోరారు. కృష్ణా నీటి వినియోగంపై అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న సమయంలో ఉత్తమ్ తరుచూ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. రెండుమూడు సార్లు ఇదే తరహాలో ఉత్తమ్ ప్రసంగం సాగింది. దీంతో కల్పించుకున్న స్పీకర్.. 'స్పీకర్‌నుద్దేశించి మాట్లాడాలే కానీ.. సభ్యులనుద్దేశించి మాట్లాడరాదు' అని ఉత్తమ్‌కు సూచించారు. దీంతో 'సారీ సార్' అంటూ క్షమాపణలు కోరి ప్రసంగాన్ని కొనసాగించారు.

మల్లన్న స్టైలే వేరప్పా!

- సభలో నవ్వులు పూయించిన మాజీ మంత్రి విన్నపం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి మల్లారెడ్డి తనదైన మార్క్ ప్రసంగంతో సభలో నవ్వులు పూయించారు. ప్రాజెక్టులను బోర్డులకు అప్పగించడం, కాళేశ్వరం వంటి అంశాలపై సీరియస్‌గా చర్చ జరుగుతున్న సమయంలో మల్లారెడ్డిని మాట్లాడాలంటూ స్పీకర్ అవకాశం ఇచ్చారు. అప్పటికే భట్టి విక్రమార్క మాజీ సీఎం కేసీఆర్‌పై, గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దీంతో వివరణ ఇచ్చేందుకు తమకు మైక్ కావాలని హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితర నేతలు స్పీకర్‌ను కోరగా.. ఆయన వారందరినీ కాదని మల్లారెడ్డికి అవకాశం ఇచ్చారు. మల్లారెడ్డి లేచి.. 'అధ్యక్షా వసంత పంచమి వచ్చింది. ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్రం మొత్తం 26 వేల పెండ్లిళ్లు ఉన్నాయి. కాబట్టి ఆ రెండు రోజులు సభ నడుపొద్దని కోరుకుంటున్నా' అని కోరారు. దీంతో ఒక్కసారిగా సభలో నవ్వులు విరబూశాయి.

కాంగ్రెస్‌వి పచ్చి అబద్ధాలు

- ప్రభుత్వ పీపీటీకి దీటుగా బీఆర్‌ఎస్ పీపీటీ రూపకల్పన
- కాంగ్రెస్ ఆరోపణలకు బలంగా సమాధానాలు
- ఆధారాలతో నిజాల నిరూపణ

హైదరాబాద్, ఫిబ్రవరి12 (నమస్తే తెలంగాణ): కృష్ణా ప్రాజెక్టులు కేంద్రానికి అప్పగింత, కృష్ణా జలాల్లో వాటాలు, పోతిరెడ్డిపాడు విస్తరణ తదితర అంశాలపై ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా సోమవారం 'కృష్ణా నది ప్రాజెక్టులపై వాస్తవాలు.. కేసీఆర్ ప్రభుత్వ తప్పిదాలు, ప్రభుత్వ విధానాలు' పేరిట ఒక పీపీటీని రూపొందించి ప్రదర్శించింది. కేఆర్‌ఎంబీ బోర్డు సమావేశాలకు సంబంధించిన అంశాలను అందులో పొందుపరిచింది. పలు వీడియోలను సాక్ష్యాలుగా ప్రదర్శించింది. దీనికి కౌంటర్‌గా బీఆర్‌ఎస్ సైతం 'కృష్ణా నదీ జలాలపై కాంగ్రెస్ అబద్ధాలు- బీఆర్‌ఎస్ వాస్తవాలు' పేరిట ఒక పీపీటీని విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రదర్శించిన వీడియోలకు సమాధానంగా పలు వీడియోలు విడుదల చేసింది. ప్రభుత్వ వాదనలను బలంగా తిప్పికొట్టింది. ప్రభుత్వం మరుగుపరచిన వాస్తవాలను ఆధారాలతో బయటపెట్టింది.

కాంగ్రెస్ అబద్ధం: ఆపరేషన్ ప్రొటోకాల్, రూల్‌కర్వ్‌లను ఖరారు చేసిన అనంతరం వెంటనే ప్రాజెక్టులను అప్పగించేందుకు కేంద్రానికి బీఆర్‌ఎస్ హామీ ఇచ్చింది.

బీఆర్‌ఎస్ వాస్తవం: అది పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వ సెక్రటరీ రాహుల్‌బొజ్జ కేంద్రానికి రాసిన లెటర్‌లో ఆపరేషన్ ప్రోటోకాల్‌పై నిర్ణయం కాలేదు కాబట్టి ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించేందుకు గత ప్రభుత్వం ఒప్పకోలేదని స్పష్టంగా వెల్లడించారు. ఆయన లేఖనే ఇందుకు సాక్ష్యం.

కాంగ్రెస్ అబద్ధం : కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాను కేసీఆర్ ఎప్పుడూ అడగలేదు.

బీఆర్‌ఎస్ వాస్తవం: ప్రతి సందర్భంలో కేసీఆర్ న్యాయమైన వాటాకోసం అడిగారు. న్యాయమైన వాటా తేల్చాలని మినిట్స్ ఆఫ్ మీటింగ్‌లో కేంద్రమే వెల్లడించింది. న్యాయమైన వాటా తేల్చాలని కోరుతూనే గత ప్రభుత్వం 27 లేఖలు రాసింది. తేదీల వారీగా రాసిన లేఖలను బహిర్గత పరిచింది.

కాంగ్రెస్ అబద్ధం: ప్రాజెక్టుల అప్పగింతకు 2వ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అంగీకారం తెలిపింది.

బీఆర్‌ఎస్ వాస్తవం: అది పూర్తిగా అవాస్తవం. కేఆర్‌ఎంబీకి అప్పగించలేదు. ఎందుకంటే విషయం సుప్రీంకోర్టులో పరిధిలో ఉందని అప్పటి సీఎం కేసీఆర్ స్పష్టంగా చెప్పారు. అందుకు సంబంధించి మీటింగ్ మినిట్స్‌ను కూడా పీపీటీలో జతచేసింది.

కాంగ్రెస్ అబద్ధం: ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించలేదు.

బీఆర్‌ఎస్ వాస్తవం: కాంగ్రెస్ సర్కారే శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను, 15 ఔట్‌లెట్లను అప్పగించింది. అందుకు జనవరి17న కేంద్ర జల్‌శక్తిశాఖ నిర్వహించిన, ఫిబ్రవరి 1న కేఆర్‌ఎంబీ నిర్వహించిన సమావేశ మినిట్స్ సాక్ష్యం. పత్రికాముఖంగా ఇరు రాష్ట్రాల ఈఎన్సీలు మాట్లాడిన వీడియోలను కూడా బీఆర్‌ఎస్ ప్రదర్శించింది.

కాంగ్రెస్ అబద్ధం: కృష్ణా జలాల తరలింపులో ఏపీకి కేసీఆర్ సహకరించారు.

బీఆర్‌ఎస్ వాస్తవం: కేవలం సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను మాత్రం మళ్లించి ఇటు తెలంగాణకు, అటు ఆంధ్రకు మేలు చేయాలని మాత్రమే నిర్ణయించారు.

కాంగ్రెస్ అబద్ధం: రాయలసీమ లిఫ్ట్‌పై కేసీఆర్ స్పందించలేదు.

బీఆర్‌ఎస్ వాస్తవం: ఏపీ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ పనులకు జీవో ఇవ్వక ముందే దానిపై ఫిర్యాదు చేస్తూ కేంద్రజల్‌శక్తిశాఖకు బీఆర్‌ఎస్ సర్కారు 10కి పైగా లేఖలు రాసింది. అందుకు సంబంధించిన తేదీలతో సహా లేఖలను బయటపెట్టింది. 2వ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ ఆయా అంశాలను లేవనెత్తింది. రాయలసీమ లిఫ్ట్‌ను తీవ్రంగా తప్పుబట్టింది. అందుకు ఆ మీటింగ్ మినిట్సే సాక్ష్యమని వివరించింది. ఈ నేపథ్యంలోనే కేంద్రజల్‌శక్తిశాఖ ఏపీకి లేఖ రాసిందని, లిఫ్ట్ పనులు ఆపాలని ఆదేశించిందని తెలిపింది. అందుకు సంబంధించిన లేఖను కూడా బయటపెట్టింది. గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లి సీమలిఫ్ట్ పనులపై స్టే కూడా తీసుకొచ్చిందని వివరించింది.

కాంగ్రెస్ అబద్ధం: పోతిరెడ్డిపాడు విస్తరణ చేపట్టినా పదవుల కోసం బీఆర్‌ఎస్ పెదవులు మూసుకుంది.

బీఆర్‌ఎస్ వాస్తవం: పోతిరెడ్డిపాడు విస్తరణ సమయంలో అప్పటి ప్రభుత్వంలో లేము. మంత్రివర్గంలో భాగస్వామిగా కూడా లేము. అంతకు రెండు నెలల ముందుగానే మంత్రిపదవులకు ఇదే విషయమై రాజీనామా చేశాం. బహిరంగంగానే నాటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశాం.

కాంగ్రెస్ అబద్ధం: కేంద్రం జారీచేసిన రివర్‌బోర్డుల గెజిట్ నోటిఫికేషన్‌ను బీఆర్‌ఎస్ వ్యతిరేకించలేదు.

బీఆర్‌ఎస్ వాస్తవం: అది తప్పు. గెజిట్‌ను వ్యతిరేకిస్తూ అప్పటి స్పెషల్ సీఎస్ రజత్‌కుమార్ 2021లోనే కేంద్రానికి లేఖ రాశారు. ఆ విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం నియమించిన ప్రస్తుత కార్యదర్శి రాహుల్‌బొజ్జానే తన లేఖలో స్పష్టంగా వెల్లడించారు.

'మేడిగడ్డ' సందర్శనకు బీజేపీ దూరం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాప్రతినిధుల మేడిగడ్డ సందర్శనకు తాము హాజరు కావడం లేదని బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. ఈ సందర్శనకు దూరంగా ఉండాలన్నది తమ పార్టీ అభిప్రాయమని చెప్పారు.

కేసీఆర్ దెబ్బకు దిగొచ్చిన కాంగ్రెస్ సర్కార్

- నల్లగొండ సభ పిలుపుతో కాంగ్రెస్‌లో కలవరం
- సభలో హడావిడి తీర్మానం
- రాత్రికిరాత్రే అసెంబ్లీ ఎజెండా మార్పు
- బడ్జెట్‌పై చర్చను పక్కకు పెట్టి.. కృష్ణా జలాలపై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ దెబ్బకు కాంగ్రెస్ సర్కారు దిగొచ్చింది. నల్లగొండ సభ పిలుపుతో కలవరం చెందిన సర్కారు రాత్రికి రాత్రే అసెంబ్లీ ఎజెండా మార్చేసింది. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించి తెలంగాణ ప్రజల నీటి హక్కును కాలరాసే ప్రయత్నానికి కేసీఆర్ ఆదిలోనే అడ్డుకట్ట వేశారు. తన మార్క్ రాజకీయంతో కాంగ్రెస్ సర్కారు దిగొచ్చేలా చేశారు. కృష్ణా జలాలపై పోరుకు శంఖారావం పూరించారు. మంగళవారం నల్లగొండలో భారీ బహిరంగ సభకు పిలుపునిచ్చారు. కేసీఆర్ నిర్ణయంతో కాంగ్రెస్‌లో కలవరం మొదలైంది. దీంతో కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై యూటర్న్ తీసుకొన్నది. ఇందులో భాగంగానే అసెంబ్లీలో సోమవారం తీర్మానం పేరుతో హడావిడి చేసింది. అసలు వాస్తవానికి అసెంబ్లీ ఎజెండాలో కృష్ణా జలాలపై తీర్మానానికి సంబంధించిన అంశం లేదు. కానీ మంగళవారం నల్లగొండలో బీఆర్‌ఎస్ సభ జరుగుతుండటంతో ఈ సభను ఎదుర్కొనేందుకుగానూ సోమవారం అసెంబ్లీలో తీర్మానం అంకానికి తెరలేపిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం ఆదివారం రాత్రి అసెంబ్లీ ఎజెండాలో ఈ అంశాన్ని పొందుపరిచింది. వాస్తవానికి సోమవారం బడ్జెట్‌పై చర్చ ఉండాలి. దానిని పక్కకు పెట్టిన ప్రభుత్వం.. కృష్ణా జలాలపై తీర్మానాన్ని ముందుకు తెచ్చింది. మొన్న జరిగిన బీఏసీలోనూ ఈ తీర్మానంపై ఎలాంటి నిర్ణయం జరగలేదు. కానీ బీఆర్‌ఎస్ సభతో ప్రజలకు ఎలాగూ వాస్తవం తెలిసిపోతుందని, అప్పుడు ప్రజల ముందు దోషిగా నిలబడాల్సి వస్తుందని భావించిన కాంగ్రెస్ పార్టీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తాము కూడా కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతకు వ్యతిరేకమని చెప్పుకొనేందుకు నానా తంటాలు పడుతున్నది. ఈ నేపథ్యంలో కేసీఆర్ తన మార్క్ రాజకీయంతో సభకు ముందే విజయం సాధించారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పోరాటం ద్వారా ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల రైతులకు మేలు జరిగిందని భావిస్తున్నారు.